క్లుప్తంగా

5న ఎంపిక పోటీలు

కడెం: హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి ఈనెల 5న మండల కేంద్రంలో విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో మధుసూదన్ ప్రకటనలో తెలిపారు. నాల్గో తరగతిలో ప్రవేశానికి ఎనిమిది నుంచి తొమ్మిదేళ్ల లోపువారు, ఐదో తరగతిలో ప్రవేశానికి 9 నుంచి 10 ఏళ్ల లోపున్న పిల్లలు అర్హులని అన్నారు. పోటీలకు వచ్చే విద్యార్థులు బోనఫైడ్, ఆధార్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం పట్టణంతోపాటు మండలానికి చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అందజేశారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని అంబకంటి, లింబా(కె) గ్రామాల్లో సోమవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సర్పంచులు ప్రదీప్‌కుమార్, ఆనందరావు పటేల్, ఆత్మ చైర్మన్ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ గిరీష్‌కుమార్, ఉపసర్పంచ్ రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పోడు' పట్టాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నిర్మల్‌టౌన్: తమకు పోడు భూముల పట్టాలివ్వాలని తానూర్ మండలం మొగిలి గ్రామ పలువురు రైతులు కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో రైతులు కలెక్టర్‌ను కలిశారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రావు పటేల్, రాజేశ్వర్, సర్పంచ్ పుండలిక్, ఎంపీటీసీ లక్ష్మణ్, గ్రామస్తులు ఉన్నారు.

నర్సరీ, కిచెన్‌గార్డెన్ పరిశీలన

కుంటాల: తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఓలాలో నర్సరీ, కిచెన్‌గార్డెన్ పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా 1లక్షా 20 వేల మొక్కలు నాటిస్తామన్నారు. వారి వెంట సర్పంచ్ కనీస్ ఫాతిమా, ఎంపీఓ రహీం, ఎఫ్ఏ వాణి తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ముధోల్: మండల కేంద్రంలోని పశుపతినాథ్ శివాలయ సమీపంలో సోమవారం రూ.1.50లక్షలతో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు అఫ్రోజ్‌ఖాన్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎంపీటీసీ సరళ శ్రీనివాస్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాలీద్, సురేందర్‌రెడ్డి, పోతన్నయాదవ్, సంజీవ్, గోపిపటేల్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



గోదావరి జలాలతో భక్తులు

లోకేశ్వరం: పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రతిమలకు జలధివాసం వేదపండితులు గురుమంచి చంద్రశేఖర్ నిర్వహించారు. సర్వతోభద్రాది స్థాపన, చండి హోమం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌజన్య, దీక్షాపరులు కపిల్, నవీన్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ వృద్ధాశ్రమంలో ఆదివారం ఓ అనాథ వృద్ధురాలు మృతి చెందింది. ఆమెకు అంత్యక్రియలు నిర్వహించి స్థానిక బంగల్‌పేట్ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన మున్సిపల్ కాంటాక్ట్ ఉద్యోగి ఉప్పిరి చిన్ను ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. సోమవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ సీవీఎన్ రాజు దగ్గరుండి జిల్లా ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి, మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి రూ.రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేశారు. మంత్రి సహకారంతో వారి కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు, భార్యకి ఉద్యోగం ఇచ్చి పిల్లల చదువుకు అండగా ఉంటామన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన పూసల మనోజ్ కాలుకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి చేరాడు. సోమవారం బీఆర్‌ఎస్ నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అంతకుముందు ఖానాపూర్ ఎలక్ట్రానిక్ మీడియా మండల కార్యవర్గాన్ని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సన్మానించారు. అనంతరం పలువురు జాన్సన్‌నాయక్‌ను సన్మానించారు.

'డబుల్' ఇళ్లను అమ్ముకోవద్దు

- మంత్రి ఐకేరెడ్డి
- పాక్‌పట్లలో 50 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ
- మహిళల పేరిట పట్టాలు అందజేత



భీం విగ్రహం ఆవిష్కరిస్తున్న మంత్రి ఐకేరెడ్డి



లబ్ధిదారుకు కేటాయించిన ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

సోన్: పేదలకు సొంతింటి కల నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని.. తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులెవరూ అమ్ముకోవద్దని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో రూ.రెండున్నర కోట్లతో నిర్మించిన 50 డబుల్ బెడ్ రూం ఇళ్లను కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి 50 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఇళ్లలో వసతుల కల్పన కోసం అదనంగా రూ.30లక్షలు వెచ్చించినట్లు పేర్కొన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5.04లక్షల ఖర్చయినట్లు తెలిపారు. మహిళలను గౌరవిస్తూ వారి పేరిట పట్టాలు ఇచ్చామన్నారు.

త్వరలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ఏర్పాటు..

మండలంలో అన్ని గ్రామాల్లో సబ్‌స్టేషన్లు నిర్మించామన్నారు. సోన్ ఐబీ నుంచి గాంధీనగర్ వరకు రూ.14 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి టెండరు నిర్వహిస్తామన్నారు. 40 ఎకరాల్లో రూ.300 కోట్లతో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ సందర్భంగా భూమి దాతలు ఎల్‌చల్ గంగారెడ్డి, రమేశ్, లోకేశ్‌రెడ్డిని అభినందించారు.

పోరాట యోధుడు కుమురం భీం..

జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన యోధుడు కుమురం భీం అని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. మండలంలోని సోన్, లోకల్ వెల్మల్ గ్రామాల్లో భీం విగ్రహాలను ఆవిష్కరించారు. నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై రవీందర్, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, అల్లోల మురళీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు మోహినొద్దిన్, సర్పంచ్‌లు వినోద్‌కుమార్, గంగారెడ్డి, కవిత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లేశ్

ఖానాపూర్: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో మల్లేశ్, అధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు, అంగన్‌వాడీ, ఐకేపీ, హెల్త్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ప్రతీ శుక్ర, మంగళవారాల్లో డ్రై డే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శివ, స్రవంతి, ఎంపీవో చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించాలి

పెంబి: గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, ఐకేపీ సిబ్బంది వీధుల్లో తిరుగుతూ నీరు నిల్వకుండా చూడాలన్నారు. ఎంపీవో రత్నాకర్ రావు, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముధోల్: సీజనల్ వ్యాధులపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో శివప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో అమీర్‌ఖాన్, మోహన్‌సింగ్, మనుమోహన్ శాస్త్రీ, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు



ఖానాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



సోన్: న్యూవెల్మల్‌లో పూజలు చేస్తున్న భక్తులు



లక్ష్మణచాంద: మునిపెల్లిలో పల్లకీసేవ

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ శివారులోని బ్రహ్మేశ్వరాలయంలోని శివాలయంలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. గురుపూజోత్సవంలో భాగంగా శ్రీశ్రీశ్రీ సత్యానంద స్వామిజీ సమాధి వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలాజీ పటేల్, విఠల్‌రెడ్డి, గంగాధర్, లింగారెడ్డి, దత్తు, భూమారెడ్డి, శ్రీనివాస్, రమణారెడ్డి, రమేశ్‌రెడ్డి, హన్మాగౌడ్, మధు, సుదర్శన్, రఘు ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర పాఠశాలలో విద్యార్థులు వ్యాస మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, చైర్మన్ దేశాయ్, డైరెక్టర్ పోతన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు శ్రీ దత్త వెంకటసాయి బాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ముగిసాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో సాయి బాబా ఆలయంలో వీడీసీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. పూజారి జంగం నీలేశ్‌సాయి బాబాకు పంచామృతాలతో అభిషేకం, అర్చన నిర్వహించారు. అనంతరం సాయి పల్లకి ఊరేగింపులో వీడీసీ అధ్యక్షులు సాగర్, రవి, శ్రీనివాస్, మల్లయ్య, నర్సయ్య, గంగాధర్, భోజన్న, కిరణ్‌రావ్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీసేవలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సాయి బాబాకు అభిషేకాలు, పారాయణం, పల్లకీసేవ మహోత్సవం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు భూక్యా జాన్సన్‌నాయక్.. కార్యకర్తలతో ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



జడ్డి మణిదీప్ | లిఖిత | సుధీర్‌కుమార్ | సూరప్రణవి | సిద్ధు | రాథోడ్ నీరజ | దాసి నాగశ్రీ | అభిజ్ఞరెడ్డి



పల్లవి | సంతోషి | హైమద్ | శ్రీహర్షిణి

లక్ష్మణచాంద: బాసర ట్రిపుల్ ఐటీలో చదివేందుకు ఎంపికైన వారి మొదటి జాబితా సోమవారం ప్రకటించారు. ఈ మేరకు ఇద్దరు మండల విద్యార్థులు ఎంపికయ్యారు. మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన జడ్డి శ్రీనివాస్–పల్లవి దంపతుల కుమారుడు మణిదీప్‌తోపాటు నిర్మల్‌రూరల్ మండలం రత్నాపూర్ కాండ్లీకి చెందిన లిఖిత ఇటీవల వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. కాగా వీరిద్దరూ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్ వర్మ, ఇతర ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండా గ్రామానికి చెందిన చవాన్ అంబాజీ–సేపాబాయి దంపతుల కుమారుడు చవాన్ సుధీర్‌కుమార్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. ఇతడు మండలకేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు.

మామడ: మండలంలోని మామడ, కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు బాసర ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారు. మామడ పాఠశాలకు చెందిన సూర ప్రణవి, మాదాస్తు సిద్ధూ, రాథోడ్ నీరజ, దాసి నాగశ్రీతో పాటు కొరిటికల్ పాఠశాలకు చెందిన గంగడి అభిజ్ఞరెడ్డి, రెడ్డిమల్ల శ్రీహర్షిణి సీట్లు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయులు నరసింహస్వామి, వెంకటరమణారెడ్డి, తదితరులు అభినందించారు.

ముధోల్: బాసర ట్రిపుల్ ఐటీకి మండల కేంద్రంలోని రబీంద్ర పాఠశాల విద్యార్థి సోఫియాన్ హైమద్ ఎంపికయ్యాడు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

మస్కాపూర్ నుంచి ఎనిమిది మంది..

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం బాలాజీ తెలిపారు. పాఠశాలకు చెందిన శ్రీపాద సుదీక్ష, ఫైజాబేగం, భవిత, ప్రమోద్, నవదత్, శివానీ, విశ్వజయతేజ్, శ్రీపూజిత ఎంపికవగా.. ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కుంటాల నుంచి 17 మంది ..

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని 15 మంది, కుంటాల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, హెచ్‌ఎం గజపల్లి నర్సయ్య ఒక ప్రకటంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీఈవో రవీందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

భోసి నుంచి ఇద్దరు..

తానూరు: మండలంలోని భోసి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఇద్దరు నూనెవార్ సంతోషి, సూర్యవంశీ పల్లవి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పి.గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిని పలువురు అభినందించారు.

'ఆర్డినెన్సు రద్దు చేయాలి'

నిర్మల్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ ప్రభుత్వంపై తీసుకొచ్చిన ఆర్డినెన్సును వెంటనే రద్దు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ సయ్యద్ హైదర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిరసన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు కొనసాగిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కోఆర్డినేటర్ దేవర్శెట్టి రవి, షబానా బేగం, సోఫి, ఇమ్రాన్, మహమ్మద్ మూసేబ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువుకు సన్మానం



అన్నారావును సన్మానిస్తున్న సమితి సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రోజు ఉదయం పతంజలి యోగ శిక్షణ ఇచ్చే గురువు గట్టు అన్నారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పతంజలి యోగసమితి సభ్యులు రాజేశ్వర్ పాండే, జనార్దన్, డా.మల్లయ్య, రాజేందర్, బాలాజీ, నారాయణరావు పటేల్, మహేందర్, సంపత్, రాజేశ్వర్, చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

'ఇళ్ల పంపిణీలో అర్హులకు అన్యాయం'



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదల ధర్నా

ఖానాపూర్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో అధికారులు.. అర్హులకు అన్యాయం చేసి అనర్హులకు ఇళ్లు కేటాయించారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోశ్, సీపీఎం మండల కార్యదర్శి చుంచుల నారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్ రూం అర్హుల జాబితాలో ఇల్లు రాని పేదలు నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ అనర్హులకు ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైలారపు గంగాధర్, వర్మ, కరిపె రాజశేఖర్, శంకర్ తదితరులున్నారు.

'కేసీఆర్ డ్రామాలను ప్రజలు నమ్మరు'



మాట్లాడుతున్న మోహన్‌రావు పటేల్

లోకేశ్వరం: కేసీఆర్ ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో పల్లెపల్లెకు బీజేపీ గడపగడపకూ మోహన్‌రావు పటేల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ అవినీతిలో కూరుకుపోయిన కేసీఆర్ కుటుంబాన్ని తగిన బుద్ధి చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుమన్‌కుమార్, సుబాశ్ పటేల్, నరహరి, అనిల్, భూమన్న తదితరులున్నారు.

గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి..

ఖానాపూర్: బీజేపీని గ్రామస్థాయిలో సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ ఖానాపూర్ మండల విస్తారక్ లక్ష్మీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని గోసంపల్లె, పాత ఎల్లాపూర్, బావాపూర్(కే), సత్తన్‌పల్లి, కొత్తపేట్, దిలావార్‌పూర్ గ్రామాల్లోని శక్తి కేంద్రాల పరిధిలో పర్యటించారు. మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ మండలాధ్యక్షుడు టేకు ప్రకాష్, శైలేందర్, మెతె రాజలింగు, అశోక్, రాజ్‌కుమార్, రాజేశ్వర్, పుల్లయ్య, శంకర్, రాజలింగు తదితరులు ఉన్నారు.

బుద్ధుడు చూపిన మార్గంలో పయనిద్దాం



మాట్లాడుతున్న బీఎస్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

ముధోల్: బుద్ధుడి బోధనలు ఆచరణీయమని.. వారు చూపిన మార్గంలో పయనిద్దామని బీఎస్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌గడ్‌పాలే అన్నారు. సోమవారం ముధోల్‌లో నాగార్జుననగర్ బుద్ధ విహార్ ఆవరణలో నిర్వహించిన వర్షావాస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ కేంద్రీయ శిక్షకుడు యువరాజ్ మోరె, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు గంగాధర్, సంస్కార్ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాగ్మారే నారాయణ, సంరక్షణవిభాగ్ రాష్ట్ర కార్యదర్శి వాగ్మారే తదితరులున్నారు.

భైంసాటౌన్: బుద్ధుడి బోధనలు అనుసరణీయమని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసా పట్టణాధ్యక్షులు ప్రసంజిత్ హేమ్లే అన్నారు. పట్టణంలోని ఏపీ నగర్, రాహుల్‌నగర్‌లోని మైత్రేయ బుద్ధవిహార్‌లో సోమవారం వర్షావాస్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోజు అంబేద్కర్ రచించిన ది బుద్ధా అండ్ హిజ్ ధమ్మ అనే గ్రంథ పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ సభ్యులు ఏక్‌నాథ్ బిరదే, ధమ్మనంద్ దేవ్కే, ఆనంద్‌రావ్ షానే, విఠల్ బిరదే, రాహుల్, రేఖ, అనిత, గణేశ్, బౌద్ధ ఉపాసకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ క్విజ్ పోటీలో పాల్గొనాలి

ముధోల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్(పోటీ)లో 16 ఏళ్లు దాటిన వారంతా పాల్గొనాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ అంజాద్ తెలిపారు. సోమవారం ముధోల్‌లో ఆయన మాట్లాడారు. నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా కేవలం ఉద్యమాలు మాత్రమే కాక విద్యార్థుల నైపుణ్యం వెలికి తీసే కార్యక్రమాలను చేస్తుందన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతిగా టాబ్లెట్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి స్మార్ట్ వాచ్‌లు, ఇయర్‌బర్డ్స్, హార్డ్‌డ్రైవ్, పవర్ బ్యాంకులు అందజేస్తామని పేర్కొన్నారు. మహిళ కేటగిరిలో మొదటిస్థానంలో నిలిచిన వారికి ఎన్‌ఎస్‌టీయూఐ తరఫున ఎలక్ట్రికల్ స్కూటీ అందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 85199 90416, 6305674166 సంప్రదించాలన్నారు.

ఫౌంటేన్‌లా భగీరథ పైప్‌లైన్



నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బైల్ బజార్ సమీపంలో సోమవారం రాత్రి మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో ఒక్కసారిగా నీరు పైకి లేచి ఫౌంటేన్‌ను తలపించింది. దీంతో రహదారిపై వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికులు భగీరథ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి మరమ్మతులు చేపట్టారు.

అర్జీదారులు ఫుల్.. అధికారులు నిల్





జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీదారులు పోటెత్తారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ హాజరైనా.. సగానికి పైగా జిల్లాశాఖల అధికారులు హాజరు కాలేదు. దీనిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ అర్జీలను స్వీకరించారు. అర్జీలను అధికారులకు పంపి వారంలోగా సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరికొందరు అధికారులను అక్కడకు పిలిపించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

సన్మానం

కుంటాల: కుంటాల ఆర్‌ఐగా అడెల్లు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఆర్‌ఐ విజయ్ కుబీర్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. వీరిని అధికారులు సన్మానించారు. తహసీల్దార్ కలీం, ఎంపీడీవో దేవేందర్, ఎంపీఓ రహీం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899